క్లుప్తంగా

నేటితో ముగియనున్న దరఖాస్తులు

అశ్వాపురం: మండలంలో నూతనంగా మంజూరైన 10 రేషన్‌షాపులకు దరఖాస్తుల ప్రక్రియ నేటితో ముగియనుంది. మండలంలో 16 రేషన్‌షాపులు ఉండగా మరో 10 షాపులు మంజూరయ్యాయి. ఈ షాపుల నిర్వహణ కోసం దరఖాస్తులు ఈ రోజుతో ముగియనున్నాయి. మండల పరిధిలోని సీతరాంపురం, సంద్రలబోడు, మల్లెలమడుగు, కళ్యాణపురం, మంగలిచెలక, ఎలకలగూడెం, వేములూరు, తురుములగూడెం, చవిటిగూడెం, కాలువబజార్ గ్రామాల్లో నూతనంగా రేషన్‌షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఈ షాపులకు స్థానికంగా ఉండే స్వయం సహాయక సంఘాలకు ఇవ్వనున్నారు. ఐకేపీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నేటితో దరఖాస్తులకు గడువు ముగియనుండగా గురువారం వరకు ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చింది. దరఖాస్తులకు గడువు పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

చర్ల: మండల కేంద్రంలోని సాయినగర్‌లో ఉన్న వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొమరంభీం విద్యాలయంలో గురువారం ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులు బోధనా తీరుపై శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులకు బోధనలో భాగంగా నేర్పించాల్సిన అభినయ గేయాలు, సుభాషితాలు, దేశభక్తి గీతాలను వివరించారు. నెలవారీ సిలబస్‌లో భాగంగా బోధన ఏలా సాగించాలన్న అంశాలపై కూడా ఈ శిక్షణలో వివరించారు. అనంతరం గ్రామాల్లో పంపిణీ చేసేందుకు 40 రకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను ఉపాధ్యాయులకు అందించి వాటిని గ్రామాల్లో పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రముఖ్ రాజు, ప్రఖండ సంఘటన కార్యదర్శి శోభన్, జిల్లా సహ సంఘటన మంత్రి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులను గుర్తించాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కులాలో చేతి వృత్తులు చేసుకునే వారికి చేయూత పథకం ద్వారా అందజేసే ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించాలని భద్రాచలం మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి అన్నారు. చేయూత పథకానికి 861 దరఖాస్తు చేసుకోగా వారిలో అర్హులను గుర్తించేందుకు పట్టణంలో మూడు బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయి. సర్వే బృందాల పని తీరును ప్రత్యేక అధికారి పర్యవేక్షించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ అనిల్‌కుమార్, వంశి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని ఎంజేపీటీ బీసీ బాలికల, బాలుర గురుకుల పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరంలో వైద్యాధికారి శివకుమార్ విద్యార్థిని, విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థినీ, విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పొడి దుస్తులు ధరించాలని సూచించారు. సూపరింటెండెంట్ దయామని, రాంప్రసాద్, సుమ, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడాలి

మణుగూరురూరల్: సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఆర్.లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన బార్ షాప్ వర్కర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట రమేష్, అక్కి నర్సింహరావు, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోందె కుటుంబరావు, బార్ షాప్ వర్కర్స్ యూనియన్ నాయకులు బోశెట్టి సతీష్, నరసింహారావు, ఉసికెల కొండయ్య, లక్ష్మణ్, సాంబ, కార్మికులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: ఈ నెల 9వ తేదీన భద్రాచలంలో నిర్వహించే ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ సదస్సును జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.మురళీమోహన్, ఐటీడీఏ సబ్ కమిటీ కన్వీనర్ బాలు కోరారు. గురువారం టీఎస్‌యుటీఎఫ్ జిల్లా, మండల కమిటీ అధ్వర్యంలో మండలంలోని పాఠశాలలను సందర్శించారు. జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, దుమ్ముగూడెం మండల అధ్యక్షులు రూప వినయ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: మధ్యాహ్న భోజన పథకం యూనియన్ సీఐటీయూ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలపై మండల విద్యాధికారి ఎంఈఓకు సమ్మె నోటీస్ ఇచ్చారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10, 11, 12 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా టోకెన్ సమ్మె జరుగుతుందని తెలిపారు. శ్రామిక మహిళా పట్టణ కన్వీనర్ మర్లపాటి రేణుక, మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ పట్టణ కార్యదర్శి పిలక శివమ్మ, సభ్యులు అక్కల జ్యోతి, సీహెచ్ రమ, పద్మ, రాజేశ్వరి, పాపమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

‘హద్దులు’ దాటిన అక్రమ రవాణా

- హైదరాబాద్‌కు పశువుల తరలింపు
- భద్రాచలం మీదుగా మళ్లీ జోరందుకున్న వైనం..
- ఊపిరాడకుండా కుక్కి యథేచ్ఛగా రవాణా
- అర్ధరాత్రి నుంచి తెల్లవారేలోపు సాగుతున్న దందా


లారీలో పశువులను కుక్కి తరలిస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సరిహద్దు గ్రామాల్లో జరిగే పశువుల సంతలతో పాటు మారుమూల ఏజెన్సీ ప్రాంతాల నుంచి పశువులను దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి ఒకచోటుకు చేరుస్తున్నారు. అక్కడ కబేళ కేంద్రాల్లో వధకు అప్పగిస్తున్నారు. 1977 గోవధ నిషేధ చట్టం ప్రకారం గోవులు, దూడలను ఎట్టి పరిస్థితుల్లోనూ చంపకూడదు. ఎద్దు, దున్న, గేదెలను చంపాలంటే వాటి వయస్సు 18 సంవత్సరాలు నిండి ఉండాలి. అవి వ్యవసాయానికి, బ్రీడ్ అభివృద్ధికి పనికి రావని పశు వైద్యుడు ధ్రువీకరించాలి. ఆ సర్టిఫికెట్ ఉన్నా.. ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాలలో మాత్రమే వధించాలి.

ఇలాంటి నిబంధనలు ఉండడంతో వాటిని వధించేందుకు దుండగులు వక్రమార్గాన్ని ఎంచుకుని రవాణా చేస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

ఐచర్ వాహనంలో ఐదు లేదా ఆరు పశువులకు మాత్రమే తీసుకెళ్లాలి. మూగజీవాలను ఎక్కడ కొన్నారు.. ఏ చోట విక్రయిస్తున్నారో అందుకు సంబంధించిన బిల్లులు, పంచాయతీ రసీదులు ఉండాలి. తరలించే వాహనాల్లో పశువులకు అవసరమైన తాగునీరు, మేత ఏర్పాటు చేయాలి. వాటిని తాళ్లతో బంధించకూడదు. ఒక రాష్ట్రానికి చెందిన పశువులను మరో రాష్ట్రానికి తీసుకెళ్లి విక్రయించకూడదు. ఈ నిబంధనలు ఏవీ పాటించడం లేదు.

జరుగుతోంది ఇదీ..

ఏజెన్సీ ప్రాంతం అయిన భద్రాచలం సరిహద్దు గ్రామాలుగా ఉన్న చింతూరుతో పాటు మరి కొన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న పశువుల సంతలో తక్కువ రేటుకు వీటిని కొనుగోలు చేస్తూ కంటెయినర్లు, వ్యాన్లలో ఎక్కించి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. భద్రాచలం మీదుగా నిత్యం వాహనాల్లో పశువులను తీసుకెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భద్రాచలం నియోజవకవర్గం పరిధిలో చర్ల మండలంలో గల పరిసర గ్రామాల నుంచి నిత్యం వ్యాన్లలో పశువులను తీసుకెళ్తున్నారు. ఈ వాహనాలను ఎక్కడైనా అడ్డుకుంటే.. కార్లలో ఎస్కార్టుగా ప్రయాణిస్తున్న కొందరు వ్యక్తులు మామూళ్లు ముట్టజెబుతున్నట్లు సమాచారం. అధికారుల తనిఖీల్లో అడపాదడపా ఎవరైనా పట్టుబడినా సూత్రధారులు మాత్రం చిక్కడం లేదు.

ఘటనలు ఎన్నో..

గత జూన్ నెలలో అక్రమంగా పశువులను తరలిస్తున్న కంటైనర్ లారీని పోలీసులు పట్టుకున్నారు. 46 పశువులతో అంబేడ్కర్ సెంటర్ నుంచి సారపాక వైపు వెళ్తున్న కంటైనర్ లారీని బ్రిడ్జి సెంటర్ వద్ద పోలీసులు ఆపి తనిఖీ చేశారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు మహ్మద్ శామ్యూల్ (హర్యానా), షారుక్ (ఉత్తరప్రదేశ్), పర్వేజ్ (ఉత్తరాఖండ్)తో పాటు లారీ యజమాని అజ్జుపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా జూన్ 27వ తేదీనఏపీలోని చింతూరు నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు అనుమతి లేకుండా 65 పశువులను తరలిస్తున్న లారీని భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన 65 పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించారు. ఈ ఘటనలో డ్రైవర్ కలీం (ఉత్తరప్రదేశ్ వాసి)తో పాటు లారీలో ఉన్న, హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్యట్, రెడ్డపావల అర్జున్ను అదుపులోకి తీసుకుని విచారించగా లారీ యజమాని ఆదేశానుసారం చింతూరు నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్నట్లు నింధితులు తెలిపారు. కాగా పోలీసులు పట్టుకున్నది కొంత అయితే అధికారుల కళ్లు గప్పి వెళ్తున్నవి ఎన్నో లెక్కలేదని తెలుస్తోంది.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎవరైన పశువులను అక్రమ రవాణా చేస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం. ఇలా తరుచుగా అక్రమంగా పశువులు రవాణా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. పశువులను రవాణా చేసే ముందు పశు వైద్యాధికారితో అనుమతి తీసుకుని యానిమల్ యాక్ట్ నిబంధనల ప్రకారం రవాణా చేయలి. పశువుల రవాణా చేసే సమయంలో ఏ రైతు వద్ద ఎక్కడ కొనుగోలు చేశారు.. అక్కడ సంబంధిత గ్రామ పంచాయతీ అనుమతి రశీదులు తప్పని సరిగా చూపించాలి.

– పి.నాగరాజు రెడ్డి, భద్రాచలం సీఐ

పెంపుడు జంతువులకు వ్యాక్సిన్


దమ్మపేట: కుక్కకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారి మన్యం రమేష్

దమ్మపేట: వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు పశు వైద్యశాలలో రేబిస్ వ్యాక్సిన్ వేశారు. గురువారం దమ్మపేట పశు వైద్యశాలలో డాక్టర్ మన్యం రమేష్ బాబు, కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌ను వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ.. పెంపుడు కుక్కలు, తదితర జంతువులు ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా, వాటికి రేబిస్ టీకాలు వేయించాలని అన్నారు. పెంపుడు జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల మనుషులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, అత్యం వెంకటేశ్వరరావు, వైద్యశాల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జంతు ప్రేమికులకు సన్మానం..

భద్రాచలంఅర్బన్: వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ అఫ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో గురువారం భద్రాచలంలోని జంతు ప్రేమికులు, వెటర్నరీ అసిస్టెంట్ వెంకన్నబాబు, లాయర్ పామరాజు తిరుమలరావు, ఆదినారాయణలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ భీమవరపు వెంకటరెడ్డి, సీనియర్ లయన్ యేగి సూర్యనారాయణలు మాట్లాడారు. కార్యక్రమాన్ని చేపట్టిన లయన్స్ క్లబ్‌ను డాక్టర్ కృష్ణప్రసాద్ అభినందించారు. క్లబ్ సెక్రటరీ గుండు శరత్, ట్రెజరర్ భరత్ కుమార్, పల్లింటి దేశప్ప, దాట్ల శ్రీనివాసరాజు, బి.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం పాదయాత్ర

భద్రాచలంటౌన్: గోదావరి వరదల నుంచి భద్రాద్రి ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8, 9 తేదీల్లో పట్టణంలోని ముంపు కాలనీల్లో సీపీఎం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ భద్రాచలం డివిజన్ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది గోదావరి వరదల సమయంలో భద్రాద్రి పట్టణ వాసుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే వరద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముంపు నివారణకు కోసం సీఎం కేసీఆర్ వెయ్యి కోట్లు ప్రకటించి ఏడాది కావస్తున్నా, ఇప్పటి వరకు ఆ దిశగా పనులు చేపట్టలేదని విమర్శించారు. తక్షణమే కరకట్ట మరమ్మతులతో పాటు కట్ట ఎత్తు పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాదయాత్రలో రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని పట్టణంలోని ముంపు కాలనీల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కారం పుల్లయ్య, ఏజే రమేష్, గడ్డం స్వామి, నర్సారెడ్డి, రేణుక, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన భద్రాచలం కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఆర్.కేశవరావు, కార్యదర్శిగా జక్కం ప్రసాద్, కోశాధికారిగా కె.మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా జోగారావు, జాయింట్ సెక్రటరీగా గొండేల మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగేందర్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ సభ్యులుగా జక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, వేణు, గౌరవ సలహాదారుడిగా చల్లగుళ్ల నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. 2025 వరకు ఈ కార్యవర్గం కొనసాగుతుందని కమిటీ అధ్యక్షుడు కేశవరావు తెలిపారు.

‘బార్’ అధ్యక్షుడికి సన్మానం


దేవదానాన్ని సత్కరిస్తున్న హైకోర్టు న్యాయవాదులు

భద్రాచలంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానాన్ని శాలువాతో సత్కరించారు. హైకోర్టు బార్ అసోసియేషన్ హాల్లో జరిగిన ఈ సత్కారంలో అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చెంగల్వా కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రదీప్ రెడ్డితో పాటు ఇతర న్యాయవాదులు హాజరయ్యారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏజెన్సీలో సత్వర విచారణ, న్యాయం అందించడంలో ఏజెన్సీ న్యాయవాదుల సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

మెజిస్ట్రేట్ పోస్టును భర్తీ చేయాలి

గత మూడు నెలలుగా ఖాళీగా ఉన్న భద్రాచలం జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం జిల్లా పరిపాలన సంబంధిత న్యాయమూర్తి శ్రీదేవిని కోరారు. భద్రాచలంలో దాదాపు 3 వేలకు పైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, 100 మందికి పైగా న్యాయవాదులు ఇక్కడ ప్రాక్టీస్ చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ మెజిస్ట్రేట్ అవసరత ఉందన్నారు. ఈ మేరకు గురువారం హైదరాబాదులో న్యాయమూర్తిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ఉపా కేసులు ఎత్తివేయాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పీఓడబ్ల్యూ, ఎన్డీ నాయకులు

బూర్గంపాడు: పీఓడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు సంధ్యతో పాటుగా మరికొందరిపై తెలంగాణ ప్రభుత్వం పెట్టిన ఉపా కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బూర్గంపాడులో గురువారం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్‌లో ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్డీ నాయకులు బానోతు హుక్లా, పీఓడబ్ల్యూ నాయకురాలు పెదగొని ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రొఫెసర్ల వంటి ప్రశ్నించే గొంతుకలను అణచివేసేందుకు ప్రభుత్వం ఇలాంటి కుట్రపూరిత కేసులు పెడుతోందని ఆరోపించారు. బ్రిటిష్ కాలం నాటి ఉపా కేసులు వంటి నల్లచట్టాలను రద్దు చేయాలని సుప్రీంకోర్టు సూచించినప్పటికీ పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర పాలకులు అవే కేసులు నమోదు చేయటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఉపా కేసులు ఉపసంహరించుకోవాలని, లేకుండా ప్రజల మద్దతుతో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు పున్నంచంద్, సున్నం భూలక్ష్మి, కుర్సం సుజాత, మిడిదొడ్ల నాగేశ్వరరావు, సాధనపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వితరణ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామానికి చెందిన పాలూరి నారాయణ వారం రోజుల క్రితం మరణించగా.. బీజేపీ నాయకులు గురువారం మృతుడి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. నాయకులు పున్నం బిక్షపతి, భూక్య ప్రసాద్, లింగంపల్లి రమేష్, దాసరి వెంకటేశ్వర్లు, దుగ్గి బ్రహ్మతేజ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

ములకలపల్లి: ప్రజలు భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలపరిధిలోని మాధారం గ్రామంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులకు హాజరైన ఆయన మాట్లాడారు. పోడు భూములకు హక్కు పత్రాలు పొందామంటే అది పోరాటాల వల్లే సాధ్యమైందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, గౌరి నాగేశ్వరరావు, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, గగులోత్ దేవేందర్, సోయం వీరస్వామి, డిష్ రాంబాబు, చేడే పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆషాఢమాస బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామ మహిళలు

మణుగూరురూరల్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామంలో దానధర్మట్రస్ట్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలంతా బోనాలతో ఊరేగింపుగా గ్రామదేవత ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దానధర్మ ట్రస్ట్ చైర్మన్ గంట రాధ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు, కార్యదర్శి మీరాహుస్సేన్, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు బి.వెంకటేశ్వరరావు, ముత్తంశెట్టి నాగేశ్వరరావు, చంద్రమోహన్, వల్లభనేని నాగేశ్వరరావు, ఏనుగుల శ్రీనివాస్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమ్మె


మణుగూరురూరల్: దీక్షలో కూర్చున్న గ్రామపంచాయతీ కార్మికులు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు గురువారం నుంచి సమ్మె ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట చేపట్టిన ఈ సమ్మె శిబిరాలను సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

– సాక్షినెట్‌వర్క్


ములకలపల్లి: సంఘీభావం ప్రకటిస్తున్న జీపీ వర్కర్స్ జేఏసీ జాయింట్ కార్యదర్శి యూసఫ్


భద్రాచలంఅర్బన్: సమ్మెలో కూర్చున్న పంచాయతీ కార్మికులు

గిరిజనేతరులకూ పోడు పట్టాలిస్తాం..


పినపాక: పోడు సాగుదారులకు పట్టాలు అందజేస్తున్న రేగా కాంతారావు


దమ్మపేట: పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

పినపాక: నియోజకవర్గంలోని గిరిజనేతరులకు కూడా త్వరలో పోడు పట్టాలు అందజేస్తామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు గురువారం బయ్యారం క్రాస్ రోడ్‌లో ఉన్న జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని 23 పంచాయతీలకు చెందిన పోడు సాగుదారులకు పట్టాలు పంపిణీ చేశారు. తాను కాంగ్రెస్‌లో గెలిచినప్పటికీ టీఆర్ఎస్‌లో చేరడం వల్లే పోడు పోరును అసెంబ్లీలో ప్రస్తావించగలిగానని, చివరకు పట్టాలు సాధించామని అన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు చెందిన 1,304 మంది రైతులకు సుమారు 2,600 ఎకరాలకు పోడు పట్టాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గాప్రసాద్, ఎంపీడీఓ చంద్రశేఖర్, రైతుబంధు సమితి అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు తదితర నాయకులు పాల్గొన్నారు.

మరోవైపు, మండలంలోని నారాయణపురం నుంచి మడతనకుంట వరకు సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. స్థానిక జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 24 మంది లబ్ధిదారులకు సుమారు రూ.24లక్షల విలువ చేసే కల్యాణలక్ష్మి, సాదిక్ ముబారక్ చెక్కులను రేగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోలి శెట్టి సత్తిబాబు, నాయకులు వాసు బాబు, దొడ్డ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో గురువాం పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఎనిమిది గ్రామపంచాతీలకు చెందిన 845 మందికి 1,609 ఎకరాలకు సంబంధించి పోడు పట్టాలు పంపిణీ చేశారు. మరోవైపు ఇదే ఫంక్షన్ హాల్‌లో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి సుమారు రూ.40లక్షల విలువ చేసే చెక్కులను రేగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, ఎంపీపీ కారం విజయకుమారి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఏడీఏ తాతారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: భద్రాచలం శాసనసభ్యుడు పొదెం వీరయ్య గురువారం మండలంలోని 9 పంచాయతీల్లో పోడు సాగుదారులకు పోడు పట్టాలను పంపిణీ చేశారు. మండలంలోని బీ కొత్తగూడెం, సింగవరం, పాతమారేడుబాక, నారాయణరావుపేట, లచ్చిగూడెం, మారాయిగూడెం, కొత్తపల్లి, రామచంద్రునిపేట, రామారావుపేట పంచాయతీల్లో పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, ఎంపీటీసీలు, అయా పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని లింగాలపల్లి, జమేదార్‌బంజర, పెద్దగొల్లగూడెం, మల్కారం గ్రామ పంచాయతీల పరిధిలోని గిరిజన పోడు రైతులకు పట్టాలను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి పంపిణీ చేశారు. మొత్తం 611 మంది లబ్ధిదారులకు అందజేశారు. కాగా, గ్రామాల్లోని ప్రజలు సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీలకు పాలతో అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, బీఆర్ఎస్ నాయకులు దారా యుగంధర్, దొడ్డాకుల రాజేశ్వరరావు, జలగం వాసు, సర్పంచ్‌లు పాశం సుగుణ, కొర్సా సాగర్, జయ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


దుమ్ముగూడెం: మారాయిగూడెంలో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మల్లాయిగూడెం పంచాయతీలో 72 మందికి, అనంతారం జీపీలో 73 మందికి, గాండ్లగూడెం జీపీలో 266 మందికి, నారాయణపురం జీపీ నెమలిపేటలో 65 మందికి, వినాయకపురం జీపీలో 99మందికి, ఆసుపాక 24 మందికి గురువారం పోడు పట్టా పుస్తకాలను ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అందించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు గిరిజనులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ వరలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416